131మంది కళాకారులతో కూచిపూడి నృత్యం

- వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ అటెంప్ట్‌లో స్థానం
- అందజేసిన చీఫ్ కోఆర్డినేటర్ నాగేందర్‌గౌడ్

నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

సంగారెడ్డి, ఆగస్టు 25 : నటరాజ స్ఫూర్తి డ్యాన్స్ ఎడ్యుకేషన్ సొసైటీ కూచిపూడి కళాక్షేత్రం నృత్య కళాకారులు 131మంది ఏకకాలంలో నృత్య ప్రదర్శనతో అలరించడంతో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ అటెంప్ట్‌లో స్థానం పొందారు. ఆదివారం పట్టణంలోని సెయింట్ ఆంథోనీస్ పాఠశాల ఆవరణలో నటరాజ స్ఫూర్తి డ్యాన్స్ అకాడమీ, వాసవి మా ఇల్లు స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాకారులు నృత్య ప్రదర్శన చేశారు. ఈ రికార్డును 131మంది కళాకారులతో కేవలం 9నిమిషాల ఐదు సెకండ్లలో కూచిపూడి నృత్యం చేసి రికార్డు సాధించారు. ఈ నృత్యాన్ని తిలకించిన వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ నాగేందర్‌గౌడ్, తెలంగాణ కోఆర్డినేటర్ అరుణ్‌కుమార్ పర్యవేక్షణలో కళాకారులు అరుదైన రికార్డు సాధించారు. ఈ సందర్భంగా వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ప్రతినిధులు గుర్తింపు మెడల్, సర్టిఫికెట్లను బహూకరించి కళాకారులను అభినందించారు.

నటరాజ స్ఫూర్తి డ్యాన్స్ అకాడమీ సర్టిఫికెట్‌ను బహూకరించిన సంస్థ ప్రతినిధులు

వీరభద్రస్వామి ఆలయంలో మార్మోగిన శివనామస్మరణ

సామూహికంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

గుమ్మడిదల, అగస్టు 25 : మండల పరిధిలోని వీరన్నగూడెం బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తులు సామూహికంగా రుద్రాభిషేకాలు, సత్యనారాయణ వ్రతాలు, లక్షబిల్వార్చన తదితర పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఈవో శశిధర్‌గుప్తా, పర్యవేక్షకుడు సోమయ్య భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా పర్యవేక్షించారు.

తోషిబాలో సీఐటీయూ గెలుపు ఖాయం

సమావేశంలో మాట్లాడుతున్న మల్లికార్జున్

సంగారెడ్డి, ఆగస్టు 25 : తోషిబాలో నిర్వహించే కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో సీఐటీయూ గెలుపు ఖాయమని ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని కేకే భవన్‌లో కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఐటీయూ వచ్చిన తర్వాతే కార్మికులకు ఉద్యోగ భద్రత సాధ్యమైందన్నారు. కార్మికులకు అండదుబాటులో ఉండే యూనియన్‌ను గెలిపించాలని కోరారు. అందరూ మద్దతు తెలియజేయాలన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం, ఉపాధ్యక్షుడు రాజయ్య, నాయకులు అనంతరావు, శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్, శ్రీనివాస్, రహీం, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఎస్ఈగా బాధ్యతలు చేపట్టిన శ్రీనాథ్

నూతన ఎస్ఈని సన్మానించిన 327యూనియన్ నాయకులు

సంగారెడ్డి, ఆగస్టు 25 : జిల్లాలో విద్యుత్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన మాధవరెడ్డి సరూర్‌నగర్ సర్కిల్‌కు బదిలీ అయ్యారు. నూతన ఎస్ఈగా యాదాద్రి భువనగిరి నుంచి ఇక్కడికి ఎస్ఈగా బదిలీపై వచ్చిన శ్రీనాథ్ ఆదివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనాథ్‌ను 327 కంపెనీ జిల్లా కార్యదర్శి భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఎస్ఈ మాధవరెడ్డికి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఈశ్వరప్ప, గోవిందర్‌రావు, వీరయ్య, వెంకటేశం, శ్రీకర్‌రెడ్డి, కొండన్న, శ్రీశైలం, శ్రీనివాస్‌రావు, రాజేశ్‌తో పాటు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ప్రయాణ ప్రాంగణం

- ఝరాసంగంలో ప్రధాన కూడలిలో ఆగుతున్న బస్సులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు

పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో నిండిపోయిన ప్రయాణ ప్రాంగణం

చౌరస్తాలో ఆగిన బస్సు

ఝరాసంగం, ఆగస్టు 25 : మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా ఉన్న ప్రయాణ ప్రాంగణం నిరుపయోగంగా ఉంది. ప్రయాణికుల సౌకర్యార్థం 1997లో ఈ ప్రాంగణాన్ని ప్రారంభించారు. మండల కేంద్రం నుంచి పలు గ్రామాలతో పాటు నిజామాబాద్, మెదక్ పట్టాణాలకు ప్రయాణికులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ప్రాంగణం వద్ద బస్సులు ఆగకపోవడంతో ప్రయాణికులు ఎవరూ రావడం లేదు. ఆ ప్రాంగణమంతా ముండ్ల పొదలు, పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో నిండిపోయింది. శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకొనే నాథుడే కరువయ్యాడు. ఈ ఆవరణలో ఇతర వాహనాలు నిలుపుతున్నారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద బస్సులు నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలతో పాటు ప్రయాణికులు వేసవి, వర్షాకాలంలో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ బస్సుల కోసం పడిగాపులు కాస్తూ రోడ్లపై వేచి ఉంటున్నారు. ఆ చుట్టు పక్కలా మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీరు లేక ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంగణంలో బస్సులు ఆపేలా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రయాణ ప్రాంగణాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలి

నిరుపయోగంగా ఉన్న ప్రయాణ ప్రాంగణాన్ని ఉపయోగంలోకి తీసుకు రావాలి. ప్రయాణికులు బస్సుల కోసం రోడ్లపై నిల్చుని పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శిథిలావస్థకు చేరిన ప్రాంగణంలో పిచ్చి మొక్కలు, చెత్తా చెదారం పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతున్నది. ఆర్టీసీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. **- వెంకటేశం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, ఝరాసంగం**

ఉపయోగంలోకి తీసుకొస్తాం

జహీరాబాద్ నియోజకవర్గంలో నిరుపయోగంగా ఉన్న ప్రయాణ ప్రాంగణాల వివరాలను సేకరించి ఉన్నత అధికారులకు నివేదికలు పంపించాం. వాటిని ఉపయోగంలోకి తీసుకొచ్చి ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తాం. **- జాకీర్ హుస్సేన్, డిపో మేనేజర్, జహీరాబాద్**

స్విమ్మింగ్ కోచ్‌కు జిల్లా అధికారిగా ఉద్యోగోన్నతి

కోచ్ శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానించిన టీఎన్‌జీవోఎస్ అధ్యక్షుడు జావిద్ అలీ

సంగారెడ్డి, ఆగస్టు 25 : పట్టణంలోని రాజీవ్ పార్క్‌లోని స్విమ్మింగ్ పూల్‌లో పనిచేస్తున్న కోచ్ శ్రీనివాస్‌గౌడ్‌కు యువజన, స్పోర్ట్స్ జిల్లా అధికారిగా ఉద్యోగోన్నతిపై కరీంనగర్ జిల్లాకు వెళ్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో టీఎన్‌జీవోఎస్ జిల్లా అధ్యక్షుడు జావిద్ అలీ ఆయనను సన్మానించారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్ చేసిన సేవలను కొనియాడారు. జిల్లా నుంచి స్విమ్మర్లను రాష్ట్రస్థాయిలో పాల్గొనే స్థాయికి తీర్చిదిద్దారని, ఎంతోమంది స్విమ్మింగ్‌లో తనదైన శైలిలో ప్రతిభ కనబరిచి మన్ననలు పొందారని జావిద్ గుర్తు చేశారు. కార్యక్రమంలో అభినవ్, పవన్, చౌహాన్, పవన్‌కుమార్, కృష్ణకుమార్, స్విమ్మర్స్ ఆహ్మద్ అబ్దుల్ రెహయా న్ సిద్దిఖ్, నిషిత, మోక్షిత్, మహ్మద్ ఉజేర్, విన్సెంట్, నిర్విజ్ఞ, మాధవ్, రోషిత్, వినీత్, తక్షిత్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గం

యాదగిరి, అధ్యక్షుడు

సదానందం, ప్రధాన కార్యదర్శి

సంగారెడ్డి, ఆగస్టు 25 : కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గమని మెడికల్ కళాశాల కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు యాదగిరి అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ దవాఖాన ఆవరణలో మెడికల్ కళాశాల వర్కర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా సదానందం, కోశాధికారిగా లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా మహేందర్, సినీత, సహాయ కార్యదర్శిగా భాగ్యలక్ష్మి, సభ్యులుగా ప్రసాద్, నాగార్జున, సుధీర్, లక్ష్మి ప్రియను ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఉత్తమ సేవలకు అత్యుత్తమ అవార్డు

ఉదయ్ భాస్కర్ రెడ్డికి అవార్డును అందజేస్తున్న నిర్వాహకులు

బొల్లారం, ఆగస్టు 25 : విద్యారంగంలో విశిష్ట సేవలందిస్తున్న వ్యక్తులను గుర్తించి అవార్డులను ప్రదానం చేస్తారు. శనివారం నగరంలో నిర్వహించిన యూనివర్సల్ 15వ ఎడ్యుకేషన్ లీడర్స్ సమ్మిట్ అవార్డుల ప్రదానోత్సవంలో బొల్లారం మున్సిపాలిటీకి చెందిన వాగ్దేవి స్కూల్ డైరెక్టర్ ఉదయ్ భాస్కర్ రెడ్డికి ఎడ్యుకేషన్ ఐకాన్ ఆఫ్ ది ఇయర్-2024 అవార్డును నిర్వాహకులు అందజేశారు. అవార్డుతో పాటు ప్రశంసా పత్రాన్ని బహూకరించి సన్మానించారు. కార్యక్రమంలో విద్యావేత్తలు, అవార్డు గ్రహీతలు, నిర్వాహకులు పాలొన్నారు.

వక్ఫ్ బోర్డు చైర్మన్‌ను కలిసిన నాయకులు

అజ్మతుల్లా ఉసేనిని సన్మానిస్తున్న నాయకులు

బొల్లారం, ఆగస్టు 25 : వక్ఫ్ బోర్డు రాష్ట్ర చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనిని బొల్లారం మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు నగరంలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను యువజన కాంగ్రెస్ నాయకుడు అబ్దుల్ బషీర్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు మునీర్, నాయకులు చంద్రారెడ్డి, చక్రపాణి, రాములు పాలొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు

అమ్మవారిని దర్శించుకున్న కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, ఆగస్టు 25 : భారతీనగర్ డివిజన్‌లోని ఓల్డ్ ఎంబజీలో ఆదివారం లలితా పోచమ్మ దేవి బోనాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ మోహన్‌గౌడ్ ఆధ్వర్యంలో ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ఆలయానికి రంగులు వేసి విద్యుత్ లైట్లతో అలంకరించి ముస్తాబు చేశారు. అమ్మవారిని పూలతో అలంకరించి ఆలయ పూజారి ప్రత్యేక పూజలు చేశారు. కాలనీలోని భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు బోనాలతో వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఉత్సవాల్లో కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

మార్క్స్ నగర్ కాలనీల్లో..

పటాన్‌చెరు, ఆగస్టు 25 : పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడ మార్క్స్ నగర్ కాలనీలో శ్రావణమాసం సందర్భంగా పోచమ్మ తల్లి బోనాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కార్పొరేటర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్‌ను సన్మానిస్తున్న ఉత్సవ నిర్వాహకులు

పశువుల మృతికి పీసీబీ, పరిశ్రమలే కారణం

జిన్నారం, ఆగస్టు 25 : కాలుష్య జలాలు తాగి బర్రెలు మృతి చెందడానికి పీసీబీ, పరిశ్రమల అసోసియేషన్ బాధ్యత వహించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం గడ్డపోతారం పంచాయతీ కిష్టయ్యపల్లి గ్రామంలోని బాధితుడు బాశెట్టి సాయికుమార్ కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. కాలుష్య జలాలు తాగి పద్దెనిమిది బర్రెలు మృతి చెందాయని, పాడిరైతు కుటుంబం రూ.40లక్షలు నష్టపోయిందని అన్నారు. నష్టాన్ని పీసీబీ, పరిశ్రమల అసోసియేషన్ చెల్లించాలని అన్నారు. ఈ విషయాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ ద్వారా మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్తామన్నారు. జరిగిన ఘటనపై అఖిలపక్షాల ఆధ్వర్యంలో ఉద్యమాన్ని పెద్ద ఎత్తున చేపడుతామన్నారు.కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వడ్డె క్రిష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ జనాబాయ్, మాజీ సర్పంచ్‌లు అశోక్, నీరుడిశ్రీనివాస్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు రాజుగౌడ్, ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

ఖాజీపల్లి, బొల్లారం, గడ్డపోతారం పారిశ్రామిక ప్రాంతాల్లో కాలుష్యం వెదజల్లుతున్న పరిశ్రమల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాజయ్య డిమాండ్ చేశారు. నిబంధనలు పాటించని పరిశ్రమలపై కేసులు నమోదు చేయాలన్నారు. సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన చేస్తామన్నారు.

లోకకల్యాణార్థం వీరశైవుల మహాపాదయాత్ర

పటాన్‌చెరునుంచి వీరభద్రస్వామి ఆలయం వరకు చేపట్టిన వీరశైవుల మహాపాదయాత్రలో పాల్గొన్న జహీరాబాద్ ఎంపీ సురేశ్‌షెట్కర్

గుమ్మడిదల, ఆగస్టు 25 : లోకకల్యాణార్థం విశ్వశాంతి కోసం వీరశైవలింగాయత్ సమాజం 17వ మహా పాదయాత్ర చేశారు. ఆదివారం పటాన్‌చెరు నియోజకవర్గ వీరశైవలింగాయత్ అధ్యక్షుడు పోచారం అశోక్, పటాన్‌చెరు పట్టణ అధ్యక్షుడు శివరాజ్‌పాటిల్ ఆధ్వర్యంలో ఉమామహేశ్వర స్వామి ఆలయం నుంచి బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం వరకు పాదయాత్ర చేశారు. ఈ పాదయాత్రకు ముఖ్యఅతిథులుగా హాజరైన జహీరాబాద్ ఎంపీ సురేశ్‌షెట్కర్, ఉమామహేశ్వరస్వామి ఆలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్, వీరశైవలింగాయత్ జిలా ప్రధాన జయప్రకాశ్, నాయకులు ఆవంచ సుధాకర్, ప్రశాంత్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రకు స్వాగతం

పటాన్‌చెరు నుంచి ప్రారంభమైన వీరశైవుల పాదయాత్ర బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయం వరకు కొనసాగింది. వీరిని స్థానిక సమాజం అధ్యక్షుడు ప్రసాద్, నాయకులు గటాటి రమేశ్, గిద్దెరాజు, భూమాకర్, సతీశ్‌కుమార్, సంగప్ప తదితరులు స్వాగతం పలికారు. అనంతరం వీరశైవులు వీరభద్రస్వా మి, భద్రకాళీ అమ్మవారి వద్ద ప్రత్యేక పూ జలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వీరికి ఆలయ ఈవో శశిధర్‌గుప్తా, పర్యవేక్షకులు సోమయ్య సత్కరించారు.

అభినందనీయం

పటాన్‌చెరు, ఆగస్టు 25 : విశ్వశాంతి కోసం వీరశైవ సమాజం ఆధ్వర్యంలో పటాన్‌చెరు నుంచి బొంతపల్లి వీరభద్ర స్వామి ఆలయవరకు పాదయాత్ర చేపట్టడం అభినందనీయమని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరులో ఈ పాదయాత్రను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో సమాజం ప్రతినిధులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలోని నాల్సాబ్‌గడ్డ రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న తీగలు

హాస్టల్ గడ్డ దారిలో..

కనిపించని ట్రాన్స్‌ఫార్మర్



కులగూరు రహదారిలో..

అల్లుకున్న ప్రమాదం

- విద్యుత్ స్తంభాలు, వైర్ల చుట్టూ తీగలు
- పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు

సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, వైర్లను పచ్చటి తీగలు అల్లుకున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వర్షం కురుస్తున్నా.. ఈదురు గాలులు వస్తే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉంటుందని భయపడుతున్నారు. సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– నమస్తే తెలంగాణ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి జిల్లా, ఆగస్టు 25

శాంతినగర్‌లో..

బయోచార్ పద్ధతిలో పంటల సాగు భేష్

బయోచార్ పద్ధతిలో సాగు చేసిన పంటలను పరిశీలిస్తున్న రైతులు

ఝరాసంగం, ఆగస్టు 25 : వానపాములు, బొగ్గును తగిన మోతాదులో పంటలకు వేసి పండిస్తే అధిక దిగుబడితో పాటు భూసారం, పర్యావరణాన్ని కాపాడిన వారమవుతామని హైదరాబాద్ బయోచార్ సొసైటీ అధ్యక్షుడు సాయిభాస్కర్ రైతులకు సూచించారు. ఆదివారం ఝరాసంగం మండల పరిధిలోని బిడకన్నే అరణ్య ఫార్మాకల్చర్ అకాడమీలో బయోచార్ పద్ధతిలో సాగు చేస్తున్న పెసర, బెండ, అల్లం, పసుపు, పంటలను పరిశీలించారు. వేరే పద్ధతిలో సాగు చేసిన పంటలు 45 రోజుల్లో ఎదుగుదల, ఆకులు, కాండం, వేర్లు, మొగ్గలను స్కేల్‌తో కొలిచి తేడాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో అరణ్య సంస్థ ప్రతినిధి పద్మమ్మ, ఆదిలాబాద్, హైదరాబాద్, సంగారెడ్డి తదితర ప్రాంతాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

కేతకిలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చక బృందం

ఝరాసంగం, ఆగస్టు 25 : శ్రావణమాస సందర్భంగా ఝరాసంగం కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయానికి ఆదివారం బీదర్ సౌత్ ఎమ్మెల్యే శైలేందర్ బెల్దాలె కుటుంబ సమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఎమ్మెల్యేకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం సన్మానించారు. కార్యక్రమంలో బీజెవైఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రావణ్ సింగ్, ఆలయ అధికారులు, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

నిజాంపేట్, 25 ఆగస్టు : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఈ ఘటన 161వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని నాందేడు-అకోల జాతీయ రహదారిపై బైక్‌పై ఇద్దరు బాచేపల్లి నుంచి శంకరమ్మపేట వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరిని దవాఖానకు తరలిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందారు. మతుల్లో ఒకరిది కంగ్టి మండల పరిధిలోని భీమ్ర గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. నారాయణఖేడ్ ఎస్సై విద్యాచరణ్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

లక్ష్మీనగర్‌లో పశువుల చోరీ

పాపన్నపేట, ఆగస్టు 25 : మండల పరిధిలోని లక్ష్మీనగర్ గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు పశువులను చోరీ చేశారు. గ్రామానికి చెందిన పిన్నంకి ప్రసాద్‌రావు పశువుల పాకలో ఉన్న ఒక ఆవు, రెండు గేదెలను అర్ధరాత్రి సమయంలో ఆటోలో తీసుకెళ్లారు. మరో లేగదూడ ఆటోలో నుంచి కిందకు దూకి తప్పించుకున్న దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

అందోల్, ఆగస్టు 25 : మండల పరిధిలోని అక్సాన్‌పల్లికి చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుంచి చెక్కులు మంజూరయ్యాయి. ఈ చెక్కులను ఆదివారం కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో యువజన కాం గ్రెస్ నాయకుడు వెంకటేశ్‌గౌడ్, పార్టీ గ్రామ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు భూమాగౌడ్, జితేందర్‌రెడ్డి, బీరయ్య, అంబయ్య పాల్గొన్నారు.

తాత్కాలిక ఉపాధ్యాయుడి సస్పెన్షన్

హత్నూర, ఆగస్టు 25 : విద్యార్థిని చితకబాదిన ఘటనలో తాత్కాలిక ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ భిక్షమయ్య తెలిపారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో తాత్కాలిక ఉపాధ్యాయుడిగా గోపి పని చేస్తున్నారు. అదే పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థి బాల్‌రాజ్‌ను శనివారం అకారణంగా గోపి చితకబాదడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని ప్రిన్సిపాల్ తెలిపారు.